కొండలను కొల్లగొట్టేస్తున్నారు!

- యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు
- లారీలను అడ్డుకున్న ద్వారపూడి వాసులు
- తహసీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

మండపేట: గ్రావెల్ అక్రమ రవాణా ద్వారపూడిలో యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతి పొందకుండానే కొండలను కొల్లగొట్టి కొందరు అక్రమార్కులు గ్రామ సంపదను దోచుకు పోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రావెల్ తరలించే భారీ వాహనాలు ఇళ్ల మధ్య నుంచి నిత్యం చక్కర్లు కొడుతున్నాయని చెబుతున్నారు. ఈ భారీ వాహనాల రాకపోకల ధాటికి రెండేళ్ల క్రితం వేసిన రోడ్లు అధ్వాన స్థితికి చేరాయంటున్నారు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా 24 గంటలూ భారీ వాహనాలు వచ్చి పోతుండడం వల్ల తమకు నిద్రాభంగం కలుగుతోందని మండిపడుతున్నారు. బుధవారం ద్వారపూడిలోని వేములపల్లి రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో స్థానికులు గ్రావెల్ లారీలను అడ్డుకున్నారు. అంతకు ముందురోజు రాత్రి ద్వారపూడి ప్లై ఓవర్ వద్దకు లారీలు వచ్చేసరికి గ్రామస్తులు ఆపి ఆందోళన చేశారు. గ్రావెల్ అక్రమ తరలింపును నియంత్రించాలని కోరుతూ ద్వారపూడికి చెందిన సత్తి సత్తిబాబు, నామాల పెద్ద వెంకన్న అనే వారు మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ద్వారపూడి పంచాయతీ పరిధిలోని వేములపల్లి గ్రామ గ్రావెల్ భూముల్లోంచి కొందరు అక్రమంగా గ్రావెల్ తవ్వుకుని పోతున్నారన్నారు. సర్వే నంబర్ 103 ఏ 2సీ–18 లోని 3.42 ఎకరాలు, 103ఏ 2 సీ–19 లోని 3.42 ఎకరాల్లో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ఈ భూముల పక్కనే ఉన్న సర్వే నంబర్ 103 అసైన్డ్ భూమిలోనూ నెల రోజులుగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. అనుమతులు పొందకుండా, నిబంధనలు పాటించకుండా 30 అడుగులకు మించి భారీ గోతులు పెట్టేశారన్నారు. ఈ భూముల్లో గతంలో పామాయిల్ తోటలు ఉండేవన్నారు. ఇప్పుడు అక్కడ ఒక్క పామాయిల్ మొక్క కూడా కనిపించడం లేదని పేర్కొన్నారు. దానికి తోడు వేములపల్లి నుంచి పంగిడి చెరువు మీదుగా తుంగపాడు రోడ్డుకు చేరాల్సిన లారీలు గ్రామంలోంచి రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఫలితంగా రోడ్లు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వేములపల్లి నుంచి పీరా రామచంద్రపురం రోడ్డు వెంట అనపర్తి వైపుగా వెళ్లాల్సిన లారీలు కూడా ఆ పక్క స్థానికులు అడ్డుకోవడంతో ఈ వైపుగానే వస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా ద్వారపూడి పంచాయతీ అధికారులు నోరు మెదపక పోవడం బాధాకరమని సత్తి సత్తిబాబు, నామాల పెద్ద వెంకన్న పేర్కొన్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై తహసీలోద్దర్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత ఇతర అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని వారు చెప్పారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల తరఫున వారు కోరారు.



భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు పాడవుతున్నాయంటూ ఆందోళన చేస్తున్న ద్వారపూడి వాసులు



గ్రామం మధ్య నుంచి వెళుతున్న గ్రావెల్ లారీలు

చర్యలు తీసుకుంటాం



ద్వారపూడి పంచాయతీలోని వేములపల్లి కొండల నుంచి గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.అంతేగాకుండా ఒకటి, రెండు రోజుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను, ఆర్ఐ, వీఆర్వోలను పంపించిన తవ్వకాలు సాగించారని ద్వారపూడి వాసులు చెబుతున్న ప్రాంతాన్ని సర్వే చేయిస్తాను. వాస్తవాలను నిగ్గు తేలుస్తాం.

–తేజేశ్వరరావు, తహసీల్దార్, మండపేట

హౌసింగ్ ఐరన్ తరలించడంపై కలకలం



వెంకటాయపాలెంలో హౌసింగ్ ఐరన్ తరలిస్తున్న ఆటో

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని ద్రాక్షారామ జగనన్న లేఅవుట్‌లో పేదల ఇళ్ల నిర్మాణాల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిల్వ ఉంచిన ఇసుకను మంత్రి సుభాష్ అనుచరులు ఆగస్టు నెలలో రాత్రికి రాత్రి తరలించిన సంఘటన మరువకముందే మండలంలోని వెంకటాయపాలెంలో మంగళవారం హౌసింగ్ ఐరన్ తరలింపు కలకలం చెలరేగింది. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందించిన ఐరన్ వెంకటాయపాలెంలో ఒక ఆటోపై తరలిస్తుండటంతో స్థానికుల సమాచారం మేరకు హౌసింగ్ అధికారులు వచ్చి తనిఖీ చేశారు. హౌసింగ్‌కి సబంధించిన ఐరన్‌గా గుర్తించారు. దీనిపై హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ శ్రీనివాసరెడ్డి వివరణ కోరగా స్థానికుల సమాచారం మేరకు ఏఈ సుంకర రాంబాబుతో కలసి సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశామన్నారు. వెంకటాయపాలెంకు చెందిన తిరంశెట్టి వెంకటేశ్వరరావు ఐరన్ తమ కాంట్రాక్టర్ గంట్రోతు సూర్యచంద్రరావు హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారన్నారు. అందువల్ల బుధవారం ఉదయం హౌసింగ్ కార్యాలయానికి వచ్చి పూర్తి వివరాలు తెలపాలని ఆదేశించామన్నారు. అయితే వ్యాన్‌లో ఐరన్ రాత్రికి తరలించుకుపోతే ఎలా అని అడిగితే తాము ఫొటోలు, వీడియోలు తీసుకున్నామని డీఈ సమాధానం చెప్పారు. హౌసింగ్ ఇసుక, ఐరన్ తరలింపు విషయాలపై నిగ్గు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

సప్తాహాన్ని విజయవంతం చేయండి



ఆర్యవటంలో సప్తాహానికి సిద్ధమవుతున్న రామాలయం

కాజులూరు: ఆర్యవటం చందాలవారి పేట రామాలయం వద్ద ఈ నెల ఆరో తేది బుధవారం నుంచి జరగనున్న సప్తాహాన్ని భక్తులు విజయవంతం చేయాలని నిర్వాహక కమిటీ సభ్యులు పాలిక వీరబాబు తదితరులు కోరుతున్నారు. రామాలయం వద్ద మంగళవారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆరో తేదీన ప్రారంభమయ్యే భజన కార్యక్రమాలు 13వ తేదీ బుధవారం వరకూ వారం రోజుల పాటు నిర్విరామంగా కొనసాగుతాయన్నారు. చివరి రోజు జ్యోతిర్లింగార్చన, అన్నసమారాధనతో కార్యక్రమం ముగుస్తుందన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భజన బృందం సభ్యులు, భక్తులు సప్తాహాల్లో పాల్గొనాలన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండపేట: మండలంలోని జెడ్.మేడపాడు సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ఏసుబాబు తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామంలోని సొసైటీ వద్ద ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం అవుతుందన్నారు.

రేషన్‌షాపు వద్ద పడిగాపులు



ద్రాక్షారామలో రేషన్ షాపు వద్ద పడిగాపులు పడుతున్న మహిళలు, వృద్ధులు

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటికే వచ్చేది రేషన్.. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రేషన్ బండి రాకపోవడంతో ప్రజలు రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడుతున్నారు. ద్రాక్షారామలో మూడు రేషన్ షాపుల పరిధిలోని రైస్ బండి ఇంటింటికీ రాకపోవడంతో రాత్రి సమయంలో కూడా మహిళలు, వృద్ధులు రేషన్ షాపుల వద్దకు వచ్చి గంటల సమయం వేచి ఉండి రేషన్ తీసుకుని వెళుతున్నారు. దీనితో రేషన్ బండి ఇంటికి రాదా.. ఈ పడిగాపులు తప్పవా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ వి. మాధురిని వివరణ కోరగా సివిల్ సప్లై డీటీ, వీఆర్వోలను విచారణకు పంపించానని సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిస్ట్

రాయవరం: మండలంలోని లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో 100 మందిలో 45 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. మండపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చెందిన ఆప్తాలమిస్ట్ ఎస్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ లొల్ల, మాచవరం, చెల్లూరు, కూర్మాపురం, వెంటూరు, పసలపూడి గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు 1,715 కంటి పరీక్షలు నిర్వహించగా, 100 మందికి కళ్లద్దాలు అవసరమైనట్లుగా గుర్తించామన్నారు. చెల్లూరు, పసలపూడికి చెందిన ఇరువురు విద్యార్థులకు మెల్లకన్ను శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. వైద్య శిబిరంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యురాలు జి.రంజిత, పాఠశాల హెచ్ఎం కె.నాగిరెడ్డి, ఎం.చంద్రకళ, దండు రాంబాబు పాల్గొన్నారు.

104 సిబ్బందిని ఆదుకోవాలి



వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

రామచంద్రపురం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి 104 సిబ్బందిని ఆదుకోవాలని తమ పరిధిలోని పీహెచ్‌సీలలో 104 సిబ్బంది ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులకు మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. అరబిందో యాజమాన్యం ఇవ్వాల్సిన 3 నెలల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. 104 సర్వీసులను గతంలో మాదిరిగా పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, 2020 సంవత్సరంలో జాయిన్ అయిన ఉద్యోగస్తులకు జీఓ నెంబరు 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఇంక్రిమెంట్లు చెల్లించాలని, సీనియర్ డ్రైవర్స్‌ని వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని, స్లాబ్ సిస్టం అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ యాజమాన్యం వాటాలు చెల్లించాలని కోరారు.

రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలి



కుడుపూరు రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



మాచర రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నారావు

కె.గంగవరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కుడుపూరులో జరుగుతున్న గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఈ గ్రామ సభల్లో రాత పూర్వకంగా ఫిర్యాదు అందిస్తే రెవెన్యూ అధికారులు సంబంధిత సమస్యను పరిష్కరిస్తారన్నారు. చాలా వరకు రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారం అయ్యాయని ఇంకా గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్ పిల్లి రాంబాబు, ఆర్ఐ వెంకట్రావు, సర్వేయర్ పావని రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ సభలు

కపిలేశ్వరపురం: భూసర్వేలోని రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు చేపట్టిన రెవెన్యూ గ్రామసభలు మంగళవారంతో ముగిశాయి. మండలంలో అక్టోబర్ 19న గ్రామసభలు ప్రారంభమవగా గ్రామాల్లో సభలు నిర్వహించారు. మాచరలో సర్పంచ్ వి.సునీత అధ్యక్షతన నిర్వహించిన సభలో తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తుల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సాంకేతిక సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలంటూ భూ యాజమానులు దరఖాస్తులు అందజేశారు. గ్రామసభలో రైతులు, భూ యజమానులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ



సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ద్వారా నైపుణ్య గణనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. దీనిపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. పట్టణ పరిధిలోని 30 వార్డుల్లోనూ నైపుణ్య గణన చేపట్టనున్నామని తెలిపారు. ఇందుకోసం సచివాలయ సిబ్బంది వార్డుల్లో ఏవిధంగా ఈ గణన చేపట్టాలనే అంశంపై అవగాహన కల్పించామన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. నైపుణ్య శిక్షణ పొందడానికి 15 నుంచి 59 ఏళ్లలోపు వయసున్న స్త్రీ పురుషులందరూ అర్హులన్నారు. దీనికోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేక యాప్‌ను సృష్టించిందని దాని ద్వారా సర్వే జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు సహకరించి వివరాలు తెలపాలని కమిషనర్ కోరారు. సమావేశంలో టీపీవో శ్రీధర్, సచివాలయం అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు నిబంధనలపై అవగాహన

కపిలేశ్వరపురం: ధాన్యం కొనుగోలు నూతన విధానంలో నిర్దేశించిన నిబంధనలపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సంబంధిత అధికారులకు అవగాహన అవసరమని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ధాన్యం కొనుగోలు బాధ్యతలు నిర్వహించే అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి హాజరయ్యారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ వ్యవసాయ సహాయకులు, పీఏసీఎస్ కార్యదర్శిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రైతు సేవా కేంద్రం హెల్పర్లకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ తీరుతెన్నులను వివరించారు. మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని నచ్చిన రైసుమిల్లుకు విక్రయించుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై ధాన్యాన్ని విక్రయించదలచుకున్నవారు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు.

కార్తికంలో భక్తులకు ఆర్టీసీ కానుక

- పంచారామ దర్శిని పేరుతో సోమవారాల్లో బస్సులు
- ఒకే రోజులో పంచారామాల దర్శనం
- 39 మంది భక్తులు ఉంటే వారి గ్రామం నుంచే పికప్..

రామచంద్రపురం రూరల్: పరమ శివునికి ప్రీతికరమైనదిగా భక్తులు భావించే కార్తిక మాసంలో శైవ క్షేత్రాలకు భక్తులు వెల్లువెత్తుతారు. అందులోనూ పంచారామ క్షేత్రాలకు కార్తిక సోమవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని మహాశివుని దర్శించుకుంటారు. భక్తుల సెంటిమెంటుకు ప్రాధాన్యత ఇస్తూ ఆర్టీసీ ఏటా భక్తులకు కానుకగా 'పంచారామ దర్శిని' పేరుతో అందుబాటు ధరల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. దీనిలో భాగంగా రామచంద్రపురం డిపో నుంచి ఈ నెల 4,11,18,25 తేదీల్లో కార్తిక సోమవారాల్లో భక్తులు పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోటల్లో మహా శివున్ని ఒకే రోజులో దర్శించుకుని తిరిగి ఇళ్లకు చేరుకునేలా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులు ఆయా తేదీలకు ముందు రోజు అంటే ఆదివారాల్లో 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి బయలుదేరి, భక్తులకు సోమవారాల్లో పంచారామ క్షేత్రాల దర్శన భాగ్యం కలిగించి తిరిగి రామచంద్రపురం డిపోకు చేరుకుంటాయి.



రామచంద్రపురం డిపోలో పంచారామ దర్శిని యాత్రకు సిద్ధంగా ఉన్న ఆర్టీసీ బస్సు

రిజర్వేషన్ సౌలభ్యం..

రామచంద్రపురం డిపోతో పాటు రామచంద్రపురం, ద్రాక్షారామ, తాళ్లపొలం, మండపేట, కె.గంగవరం, అంగర, మాచవరం, రాయవరం, అనపర్తి, రామవరం, బిక్కవోలు గ్రామాల్లో ఏపీఎస్ ఆర్టీసీ అధీకృత ఏజెంట్ల వద్ద పంచారామాల దర్శనానికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

39 మంది ఉంటే వారి గ్రామం నుంచే..

పంచారామ క్షేత్రాలను దర్శించుకోవాలనుకునే భక్తులు 39 మంది బృందంగా ఏర్పడి ఆర్టీసీని సంప్రదిస్తే వారి గ్రామం నుంచే బస్సులు నడిపే విధంగా ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ముందస్తు సమాచారంతో ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు.

ఉద్యోగులు, వ్యాపారులకు..

ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలకు వారు కోరుకున్న రోజుల్లోనూ పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక సర్వీసులు నడపడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది.

చార్జీల వివరాలు..

భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ప్రత్యేక ప్యాకేజీ సర్వీసులుగా నడుపుతున్నారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.1,170, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో రూ.1,125, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.915 చార్జీలుగా అమలు చేస్తున్నారు.

టికెట్ల రిజర్వేషన్, అదనపు వివరాలకు..

రామచంద్రపురం డిపో మేనేజర్	
పేపకాయల భాస్కరరావు	99592 25536
అసిస్టెంట్ మేనేజర్	
ట్రాఫిక్ ఏవీఎస్ నారాయణ	94939 53838
బస్‌స్టేషన్	73829 25520
కంట్రోలర్	73829 10769

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రయాణికుల సౌలభ్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీలో ప్రయాణం సౌకర్యవంతంతో పాటు పూర్తిగా సురక్షితం. పంచారామ క్షేత్రాలను ఒకే రోజులో దర్శించుకునేందుకు అందుబాటు చార్జీలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ప్రత్యేక సర్వీసుల్లో భక్తుల కోసం సురక్షిత మంచినీరు, బిస్కట్లు అందజేస్తున్నాం.

– పేపకాయల భాస్కరరావు, డిపో మేనేజర్, రామచంద్రపురం ఆర్టీసీ డిపో

బస్సుల కోసం వేచి చూస్తాం



కార్తిక మాసంలో పంచారామాలను భక్తులు విశిష్టంగా భావించే సోమవారాల్లో ఒకే రోజు దర్శించుకునే విధంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈ సర్వీసుల ద్వారా భక్తులు పంచారామాలను దర్శించుకునే క్రమంలో ద్రాక్షారామ చేరుకునే సరికి అర్ధ రాత్రి అయ్యే అవకాశం ఉంది. అయితే పంచారామ దర్శిని ద్వారా భక్తుల కోసం మా సిబ్బంది వేచి ఉండి దర్శన భాగ్యం కల్పించే విధంగా ఏర్పాట్లు చేశాం.

– అల్లు వెంకట దుర్గాభవాని, ఈఓ, భీమేశ్వరస్వామి దేవస్థానం, ద్రాక్షారామ

క్లోరినేషన్‌లో నూతన విధానానికి శ్రీకారం



ద్రాక్షారామలో వాటర్ ట్యాంకు క్లోరినేషన్‌కు ఎక్విప్‌మెంట్‌లో టాబ్లెట్ వేస్తున్న సర్పంచ్ అరుణ

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో ప్రజలకు సురక్షిత మంచి నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకులలో క్లోరినేషన్ చేసే పాత విధానానికి స్వస్తి పలికి నూతన విధానానికి శ్రీకారం చుట్టారు ద్రాక్షారామ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ. వివరాల్లోకి వెళితే గతంలో వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ కోసం బకెట్లతో పైకి తీసుకువెళ్లి క్లోరిన్ కలిపేవారు. అయితే నూతన విధానంలో ప్రత్యేకంగా అమర్చిన ఎక్విప్‌మెంట్ ద్వారా టాబ్లెట్ రూపంలో ట్యాంకు పైకి వెళ్లాల్సిన అవసరం లేకుండా కిందనే వేయడం ద్వారా ట్యాంకు కెపాసిటీని బట్టి సుమారు 10 రోజుల నుంచి 15 రోజుల వరకు క్లోరినేషన్ ప్రభావం ఉంటుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ తెలిపారు. ఈ విధానంలో మంగళవారం ఎక్విప్‌మెంట్‌లో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు కె.ఏడుకొండలు, కొసనా భీమశంకరం, సాక్షి పద్మనాభం, నున్న కల్యాణ్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంలో సమయం, శ్రమ, డబ్బు ఆదా అవుతాయని సర్పంచ్ అరుణ వివరించారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

- నాగేంద్రునికి ప్రత్యేక పూజలు
- పుట్టల వద్ద భక్తుల సందడి
- బాణసంచాతో బాలల కోలాహలం

కాజులూరు: మండల గ్రామాల్లో మంగళవారం ప్రజలు నాగులచవితి పూజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పిల్లలు, పెద్దలు అంతా వేకువజామునే నిద్రలేచి తల స్నానమాచరించి పొలాల్లోకి వెళ్లి నాగుల పుట్టలో పాలు పోసి, కోడిగుడ్లు వేశారు. తేగలు, బుర్ర గుంజు, చిమ్మి, చలిమిడి నాగేంద్రస్వామికి నైవేద్యంగా సమర్పించారు. నాగులపుట్ట వద్ద భక్తులు బారులుతీరి పూజలు నిర్వహించారు. పాడి, పంటలు వృద్ధి చెందాలని కోరుకుంటూ రైతులు నాగేంద్రునికి పూజలు చేశారు. పుట్టలో పాలు పోసిన తర్వాత చిన్నారులు బాణసంచా కాల్చారు. నాగుల చవితి సందర్భంగా పంటపొలాల మధ్య పుట్టల వద్ద పిల్లలు, మహిళలతో సందడి వాతావరణం నెలకొంది. అదే విధంగా మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, ఆర్యావటం, అండ్రంగి, ఉప్పుమిల్లి, అయితపూడి, కోలంకల్లో పలువురు భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నాగుల చవితిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముఖ్యంగ కె.గంగవరం, పామర్రు, యర్రపోతవరం, మసకపల్లి, కోటిపల్లి, కూళ్ల గ్రామాల్లోని పంట పొలాల్లో ఉన్న పుట్టలను సర్వాంగ సుందరంగ అలంకరించారు. అనంతరం స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పుట్ట వద్దకు చేరుకుని పుట్టలో గుడ్లు, పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు, యువకులు పుట్టల వద్ద బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. యండగండిలో సిమెంట్‌తో తయారు చేసిన పుట్ట వద్ద గ్రామస్తులు పూజలు చేసి పాలు పోశారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నాగేంద్రునికి భక్తుల పూజలు

రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలో నాగుల చవితిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఎక్కడ ఏ పుట్ట చూసినా భక్తులతో పోటెత్తింది. రామచంద్రపురం పట్టణంలోని 27 వార్డులు, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో భక్తులు పొలాలు, తోటల్లోని పాము పుట్టల వద్దకు తరలివెళ్లి పూజలు చేశారు. పుట్టల్లో పాలు, కోడి గుడ్లు, తేగలు, తేగ బుర్రల గుంజులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. దీపావళి మాదిరిగా పెద్దలు, చిన్నారులు బాణసంచా కాల్చి సందడి చేశారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంతో పాటు నియోజకవర్గంలోని శివాలయాలను భక్తులు అధిక సంఖ్యలో సందర్శించి పూజలు చేశారు.



పసలపూడిలో పుట్ట వద్ద నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు

మండపేట: నాగుల చవితి పండుగను మంగళవారం మండపేట పట్టణం, మండలంలోని 12 గ్రామాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గొల్లపుంత రోడ్డు, రావులపేట, బ్యాంకు కాలనీల్లోని పొలాలు, వడ్లా వారి తోట, ఏడిద సంగమేశ్వరస్వామి ఆలయం వద్దకు, గాంధీనగర్ శివారు పొలాలు, వాటర్ వర్క్స్‌లోని పుట్టల వద్దకు భక్తులు చేరుకుని నాగదేవతకు పూజలు చేశారు. టిడ్కో కాలనీ, బూరిగ పుంత తదితర ప్రాంతాల్లోని పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. ఏడిద రోడ్డులోని పాపమ్మ పేరంటాలమ్మ దర్శనానికి మహిళలు, చిన్నారులు, పురుషులు క్యూ కట్టారు. పుట్టలో పాలు పోసి భక్తులు మొక్కారు. కోడి గుడ్లు, బుర్రగుంజు, తేగలు, చెరకు ముక్కలు, చిమ్మిడి, చలిమిడి వంటి ప్రసాదాలను నాగేంద్రుడు, నాగ దేవతలకు నైవేద్యంగా సమర్పించి, పూజించారు. అనంతరం పుట్టల చిన్నారులు తమ వెంట తెచ్చుకున్న టపాసులు, క్రాకర్స్‌ను వెలిగించి సందడి చేశారు. దీపారాధన చేశారు. సంతాన భాగ్య కలిగించాలని మహిళలు మొక్కారు. సంతానం కలిగిన వారు బూరెలను పుట్టలపై వేసి తమ మొక్కులు తీర్చారు.



గొల్లపాలెంలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: నాగుల చవితిని పండుగను మండలంలోని 19 గ్రామాల్లో మంగళవారం భక్తి శ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. విద్యాలయాలకు ఉదయం పూట కొద్ది గంటలు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు వ్యవసాయ క్షేత్రాల్లో సందడి చేశారు. మందుగుండు సామాను కాల్చుతూ సంతోషంగా గడిపారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి నాగదేవతకు పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం, తాతపూడి, వల్లూరు, నేలటూరు, నాగులచెరువు, వాకతిప్ప, టేకి, మాచర, కోరుమిల్లి, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక తదితర గ్రామాల్లో నాగుల చవితి సందడి నెలకొంది.

రాయవరం మండలంలో..

రాయవరం: నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు పొలాలు, తోటల వద్ద ఉన్న పాముల పుట్టల వద్దకు చేరుకుని నాగన్నకు మొక్కులు తీర్చుకున్నారు. పూజల అనంతరం పుట్ట వద్దే బాణసంచా కాల్చారు. సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పుట్ట వద్ద భక్తులు బారులు తీరి నాగేంద్రుడికి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని లొల్ల, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో భక్తులు నాగుల చవితి పండుగ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.



మండపేటలోని పాపమ్మ పేరంటాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు